
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

7★★★ జిల్లా వార్తలు

గురువారం 13 జూన్ 2024

కార్పొరేట్‌తో పోటీపడేలా ప్రభుత్వ పాఠశాలలు - 10లో..

నెత్తురోడిన రహదారి - రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం - 9లో..

నకిలీ విత్తనాలపై నిఘా



విత్తనాల దుకాణాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

- జిల్లా వ్యాప్తంగా తనిఖీలు
- రసీదు లేనిదే కొనుగోలు చేయవద్దని ప్రచారం
- గ్రామాల్లో నకిలీ పత్తి విత్తనాల భయం
- బీటీ-3 విత్తనాలపైన రైతుల ఆసక్తి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

రుతు పవనాల ఆగమనాన్ని తెలుపుతూ జిల్లాలో చిరుజల్లులు పడినా ఎండవేడి ఇంకా తగ్గలేదు. వర్షాలు మొదలవడంతోనే అన్నదాతలు సాగుకు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు విత్తనాలు, ఎరువుల కొనుగోలులో రైతులు మోసపోకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ బృందం జిల్లాలోని విత్తన డీలర్లపై ప్రత్యేక నిఘా పెట్టింది. పొరుగు రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు రాకుండా ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. నకిలీ విత్తనాలతోపాటు కాలం చెల్లిన విత్తనాల వంటివి డీలర్ల వద్ద నిల్వ ఉన్నాయా? అనే కోణంలో పరిశీలిస్తున్నారు. డీలర్లు ఏ విత్తనాలు ఇస్తున్నారో తెలియని పరిస్థితి ఉండడంతో దుకాణాల్లో నిరంతరం తనిఖీ చేస్తున్నారు. డీలర్లకు వ్యవసాయ శాఖ ప్రత్యేక ఐడీలను ఇచ్చింది. కొత్త విధానాలు అమల్లోకి తెచ్చింది. ప్రత్యేక యాప్ ద్వారా విత్తనాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. కొత్త విధానాలతో ఎలాంటి విత్తనాలు అమ్ముతున్నారు? ఎక్కడి నుంచి తెస్తున్నారు? అనే వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలు ఉంటుంది. జిల్లాలో గతంలో నకిలీ విత్తనాలు పట్టుబడిన సందర్భాలు ఉన్నాయి. నకిలీ విత్తనాలతోపాటు నిషేధిత బీటీ-3 విత్తనాల అమ్మ కాలు సాగుతున్నాయి. పోలీసుల నిఘా ఉన్నా పలు గ్రామాల్లో నకిలీ విత్తన దందా కొనసాగుతూనే ఉంది. రైతులు ఏటా నష్టపోతూనే ఉన్నారు.

● పత్తి సాగుకు విత్తన భారం

పత్తి సాగు చేసే రైతులకు ఈ సారి విత్తనాల భారం పెరిగింది. జిల్లాలో 49,215 ఎకరాల వరకే సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచ నా వేసింది. పత్తి విత్తనాల బ్యాగులపై రూ.11 వరకు ధర పెరిగింది. దీంతో జిల్లాలో పత్తి రైతులపై రూ.10 లక్షల అదనపు భారం పడుతోంది. 450 గ్రాముల బరువుండే విత్తన ప్యాకెట్ ధర రూ.850 నుంచి రూ.864కు పెరిగింది. పత్తి సాగు జిల్లాలో గతంలో కంటే తగ్గిపోతూ వస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి జలాలు వచ్చే పరిస్థితులు లేకపోవడం, వర్షాలు ఎలా ఉండబోతున్నాయో తెలియని పరిస్థితుల్లో రైతులు ఈ సారి పత్తి సాగు తగ్గించుకున్నట్లు తెలుస్తోంది. గతేడాది వరకు జిల్లాలో పత్తి 80 నుంచి లక్ష ఎకరాల వరకు సాగు చేసేవారు. మరో వైపు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి నకిలీ విత్తనాలు ఏటా జిల్లాకు అక్రమంగా తీసుకవచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. 750 గ్రాముల బీటీ-3 పత్తివిత్తనాల ప్యాకెట్ రూ.800 నుంచి రూ.1200 వరకు అమ్ముకుంటున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి తీసుకొచ్చే విత్తనాల కవర్లూ మార్చి రైతులకు అందించడంతో ఏది నకిలీ ఏది అసలో తెలియని పరిస్థితి.

● వరి సాగుకు 45,770 క్వింటాళ్ల విత్తనాలు

వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ శాఖ విత్తనాలను సిద్ధంగా ఉంచింది. కొనుగోళ్లు సాగుతున్నాయి. జిల్లాలో 1.83 లక్షల ఎకరాల వరిసాగుకు 45,770 క్వింటాళ్ల విత్తనాలు, అవసరం అవుతాయని అంచనాలు వేయగా కందులు 45.06 క్వింటాళ్లు, మొక్కజొన్న 120, పత్తి 665, సోయాచిక్కుడు 1.50, మిర్చి విత్తనాలు 18, పెసర్లు 27.84, మినుములు 80, జొన్నలు 40 కిలోలు అవసరం అవుతాయని అంచనా వేశారు.

● వానాకాలం సాగు 2.35 లక్షల ఎకరాలు

జిల్లాలో వానాకాలంలో 2 లక్షల 35 వేల 866 ఎకరాల్లో వివిధ పంటలు వేయడానికి రైతులు సిద్ధమైనా వరి, పత్తి ప్రధాన పంటలుగా సాగు చేస్తారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వరి లక్షా 83 వేల 80 ఎకరాలు, పత్తి 49,215, పెసర 348, కందులు 1502, మొక్కజొన్న 1510, సోయా చిక్కుడు 5, ఎర్ర మిర్చి 180, మినుములు పది ఎకరాలు 10, జొన్నలు 10, ఆముదం ఆరు ఎకరాల్లో సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

● 49,441 మెట్రిక్ టన్నుల ఎరువులు

వానాకాలం సాగు సంబంధించి 2.35 లక్షల ఎకరాల్లో వేసే వివిధ పంటలకు 49,441 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అవుతాయని అంచనా వేశారు. యూరియా 22,484 మెట్రిక్ టన్నులు, డీఏపీ 4328, కాంప్లెక్స్ ఎరువులు 14,839, ఎంవోపీ 5936, ఎస్ఎస్‌పీ 1855 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అంచనా వేశారు.

● బిల్లులు తప్పనిసరి

జిల్లాలోని ప్రతీ డీలరు రైతులకు ఎరువులు, విత్తనాలకు సంబంధించి బిల్లులు తప్పకుండా ఇవ్వాలని వ్యవసాయ శాఖ ఆదేశాలు జారీ చేసింది. రైతులు అవసరమైన విత్తనాలు కొనుగోలు చేసినపుడు బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచనలు చేస్తున్నారు. జిల్లాలో కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఆందోళన చెందవద్దని రైతులకు గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి సూచనలు చేస్తున్నారు.

కేటీఆర్‌ను కలిసిన అర్బన్ బ్యాంక్ పాలకవర్గం



చైర్మన్‌ను అభినందిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

సిరిసిల్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ నూతన పాలకవర్గం బుధవారం హైదరాబాద్‌లో సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కే తారకరామారావును మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళితోపాటు డైరెక్టర్లు గుడ్ల సత్యానందం, పాటికుమార్ రాజు, బుర్ర రాజు, వేముల సుక్కమ్మ, అడ్డగట్ల దేవదాస్, ఎనగందుల శంకర్, వరుస హరిణి, కోడం సంజీవ్‌ను కేటీఆర్ అభినందించారు. బ్యాంక్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, గుండ్లపల్లి పూర్ణచందర్, గుండ్లపల్లి శ్రీనివాస్, అగ్గిరాములు, సత్తార్ ఉన్నారు.

చంద్రంపేట పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ రాజీవ్‌కుమార్

సిరిసిల్ల రూరల్, జూన్ 12 : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం సమగ్రశిక్ష జాయింట్ డైరెక్టర్ రాజీవ్‌కుమార్ తనిఖీ చేశారు. అమ్మఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా చంద్రంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అభివద్ధి పనులు చేపట్టారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతోపాటు నోట్ బుక్స్ యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వనమాల శ్రీనివాస్, ఏసీజీఈ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

సిరిసిల్ల క్రైం, జూన్ 12: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని కల్యాణ లక్ష్మి మండపంలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.స సుమారు 60 కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని, యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

ఇల్లంతకుంట, జూన్ 12: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నుంచి ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

నిమ్మపల్లిలో పోలీస్ మీకోసం



నిమ్మపల్లిలో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేంద్రచారి

కోనరావుపేట, జూన్ 12: కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో బుధవారం రాత్రి డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో పోలీస్ మీకోసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 60 కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. యువత మొబైల్ వాడకంతో బానిసలు కాకుండా ఉన్నత చదువులపై దృష్టి సారించాలన్నారు. సైబర్ క్రైమ్ వంటి అంశాలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజనేయులు, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో శక్తి సామర్థ్యాల వెలికితీత



టెన్నిస్ కోర్టును ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్ల క్రైం, జూన్ 12: క్రీడలు మనలో దాగి ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికి తీస్తాయని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. నూతన జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో టెన్నిస్ కోర్టును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామ న్నారు. సిబ్బంది మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండడానికి క్రీడలు తోడ్పడతాయన్న ఉద్దేశంతో టెన్నిస్ కోర్టును అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. టెన్నిస్‌కోర్టును సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ఐలు మధుకర్, యాదగిరి, రమేష్, సీఐ రఘుపతి పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

సిరిసిల్ల రూరల్, జూన్ 12: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్ధాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి బుధవారం పోలీస్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బెటాలియన్‌లో మొత్తం 23 ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల కోసం 120 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఎంపిక కోసం మంగళ, బుధవారాల్లో ఇంటర్వ్యూలను, 13వ బెటాలియన్‌కమాండెంట్ సయ్యద్ జమీల్‌బాషా సమక్షంలో 17వ బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాస్‌రావు, అడ్మినిస్ట్రేటీవ్ అధికారి ప్రమీల నిర్వహించారు. అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని కమాండెంట్ శ్రీనివాసరావు కోరారు.

బాలల బంగారు భవితకు పునాది వేద్దాం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైస్వాల్

సిరిసిల్ల రూరల్, జూన్ 12: బాలల హక్కులను గౌరవించి వారి బంగారు భవితకు పునాది వేసేందుకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైస్వాల్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం సందర్భంగా హెల్పింగ్ హార్ట్ వెల్ఫేర్ సొసైటీ, స్వచ్ఛంద సంస్థల అధ్యక్షుడు అలువాల ఈశ్వర్ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బాల కార్మికుల నిర్మూలన, బాలల హక్కుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైస్వాల్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రపంచ కార్మిక సంస్థ ఏటా స్పష్టమైన థీమ్‌తో ప్రజలకు అవగాహన కల్పించాల్సిందిగా స్వచ్ఛంద సంస్థలను, ప్రభుత్వ శాఖలను కోరుతుందని అన్నారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం మాట్లాడుతూ మహిళలు, పిల్లలు, వృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్ జెండర్స్ శాఖల ద్వారా బాల కార్మికుల నివారణ కోసం కృషి చేస్తోందన్నారు. బడి మానేసి పనిలో ఉన్న ప్రతి ఒక్కరిని గుర్తించి బడిలో చేర్పిస్తున్నట్లు చెప్పారు కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్మన్ కమటం అంజయ్య, హెల్పింగ్ హార్ట్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల తిరుమల, సైకాలజిస్ట్ పున్నం చందర్, ప్రధానోపాధ్యాయులు లకావత్ మోతీలాల్, లోక్ అదాలత్ కమిటీ సభ్యులు చింతోజు భాస్కర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, న్యాయవాదులు అడెపు వేణు, రోజా, వొడ్నాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

సిరిసిల్ల రూరల్, జూన్ 12 : విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బడిబాటతోపాటు బుధవారం ప్రభుత్వ , ప్రైవేటు పాఠశాలలు ప్రారంభమవడంతో సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్, గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలతోపాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందిస్తున్నట్లు తెలిపారు. గత సర్కారు ప్రభుత్వ విద్యకి పెద్దపీటం వేసిందన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలను మెరుగు పరిచినట్లు, మన ఊరు- మన బడి కార్యక్రమంతో పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. ఇప్పుడున్న ప్రభుత్వం కూడా విద్యకు ప్రాధాన్యం ఇస్తూ అన్నివసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శేషాద్రి, ఎంఈవో రఘుపతి, అమ్మఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రుక్మిణి, పాఠశాల ప్రధానో పాధ్యాయుడు నాగుల భాగ్యరేఖ, సెక్టోరియల్ అధికారి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

సాహితీ శిఖరం సినారె



నివాళులు అర్పిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- ఘనంగా సినారె వర్ధంతి

వేములవాడ రూరల్, జూన్ 12: 'తెలుగు కవితను మహోన్నత స్థానంలో నిలిపిన సాహితీ శిఖరం సినారె' అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం సి.నారాయణ రెడ్డి వర్ధంతి సందర్భంగా హన్మాజిపేటలోని స్మృతివనంలో నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సినారె సేవలు అందరికీ ఆదర్శమన్నారు. తెలుగు కవితను మహోన్నత స్థాయిలో నిలిపిన వ్యక్తి సినారె అన్నారు. సినారె భౌతికంగా మన మధ్యలేకపోయినా రచనలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఇప్పటి వరకు సినారె జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తున్నారనుకున్నాని, కానీ ఇక్కడికి వచ్చాక అలా నిర్వహించడంలేదని తెలిసి బాధ అనిపించిందని అన్నారు. సినారె వర్ధంతి, జయంతి అధికారికంగా నిర్వహణ, హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పైన, కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడలో సినారె విగ్రహాల ఏర్పాటు అంశాలను సీఎం దృష్టికి తీకెళ్తానన్నారు. పెద్దలను గౌరవించడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పుడూ ముందుంటారన్నారు. శాతవాహన యునివర్సిటీ వైస్ చాన్సిలర్ సంకసాల మల్లేశం మాట్లాడుతూ గ్రామంలో బాపు స్ఫూర్తితోనే ముందుకు సాగి ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. బాపు(సినారె)తో చిన్ననాటి నుంచి గడిపిన జ్ఞాపకాలు మరువలేనివన్నారు. అనంతరం డప్పు విన్యాసాలు, జానపద గేయాలు, గీతాలపనలు, కవితలు , సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సుశీలా నారాయణరెడ్డి ట్రస్టు ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య, నేషనల్ బుక్ ట్రస్ట్ దక్షిణ ప్రాంతీయ అధికారి పత్తిపాక మోహన్, ఎంపీటీసీలు చెన్నాడి శ్యామలగోవర్ధన్, రంగు వెంకటేశం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, నాయకులు సామ తిరుపతి రెడ్డి, సంఘ స్వామి, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, సినారె కుటుంబసభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో సినారె వర్ధంతి

సిరిసిల్ల రూరల్ : సినారె సాహితీ సేవలు చాలా గొప్పవని, అనేక రచనలు చేసి ప్రపంప కీర్తిపొందిన గొప్ప మేధావి సి .నారాయణరెడ్డి అని తెలంగాణ రచయితల వేదిక జాతీయ అధ్యక్షుడు జూకంటి జగన్నాథం అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని గాంధీ విగ్రహం ఎదుట బుధవారం సినారె వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ జ్ఞానపీఠ గ్రహీత సినారె అనేక మంది కవులకు స్ఫూర్తి అన్నారు. కార్యక్రమంలో జిల్లా రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు ఎలగొండ రవి, వెంగళలక్ష్మణ్, ఆడెపు లక్ష్మణ్, బూర దేవానందం, కోడం నారాయణ, గణేష్, వంశీ, తిరుపతి, రవి, మార్కండేయులు పాల్గొన్నారు.

సిరిసిల్ల సాహితీ సమితి ఆధ్వర్యంలో..

సిరిసిల్ల పట్టణంలో సినారె వర్ధంతిని జిల్లా సాహితీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సీసాస జిల్లా అధ్యక్షుడు జనపాల శంకరయ్య ఆధ్వర్యంలో సీనారె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత జూకంటి జగన్నాథం, సహా అధ్యక్షుడు కోడం నారాయణ, ఉపాధ్యక్షుడు బూర దేవానందం, చిటికెన కిరణ్‌కుమార్, సంగీతం సత్యనారాయణ, గుండెల్లి వంశీకృష్ణ, గణేష్, గజ్జెల్లి రామచంద్రం, నబ్బని బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



కళాకారుల ప్రదర్శన

సినారె జయంతి వేడుకలకు సీఎం

-ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే



హైదరాబాద్‌లో సినారె కుటుంబ సభ్యులు నిర్వహిం చే సినారె జయంతి వేడుకలకు సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించాం. సినారె అంటే సాహితీ రంగంలోనే కాకుండా ప్రజాక్షేత్రంలో సేవలందించిన మహోన్నత వ్యక్తి. మననం చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను. సినారె జయంతి, వర్ధంతి అధికారికంగా నిర్వహించేందుకు చర్యలు.

చిన్ననాటి జ్ఞాపకాలు మరువలేనివి

- ఎస్. మల్లేశం, ఎస్‌యూ మాజీ వైస్ చాన్స్‌లర్



బాపు(సినారె)తో చిన్ననాటి జ్ఞాపకాలు మరువలేనివి. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాను. సినారె గురించి ప్రపంచం మొత్తం తెలుసు. బాపుతో గడిపిన కొన్ని మధురక్షణాలను అదృష్టంగా భావిస్తాను. ఆయన రచించిన సాహిత్యాలు ఎంతో మంది కవులు, సాహితీ వేత్తలకు స్ఫూర్తిదాయకం.

గర్వంగా ఉంది

- లింగ శ్రీనివాస్, డప్పు కళాకారుడు



మహోన్నత వ్యక్తి సినారె జన్మించిన గడ్డపై ప్రదర్శన ఇవ్వడం గర్వంగా ఉంది. నేను అమెరికాతోపాటు చాల దేశాలలో ఆపిల్ కంపినీలాంటి కార్పొరేట్ కంపెనీల ఉద్యోగస్తులకు డప్పు కళను నేర్పించడంలో శిక్షణ అందించాను. ఎక్కడా కలగని సంతోషం సాహితీ సిరిసంపద సినారె ఇంట్లో డప్పు వాయించడంతో కలిగింది.

నిజామాబాద్-వరంగల్ మార్గంలో డీలక్స్ బస్సు సర్వీసు

భగత్‌నగర్, జూన్ 12: నిజామాబాద్-వరంగల్ మార్గంలో కొత్తగా డీలక్స్ బస్సు సౌకర్యం కల్పించినట్లు కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎస్ సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్-వరగంల్ మార్గంలో పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్తగా కల్పించిన డీలక్స్ బస్సు సౌకర్యాన్ని ప్రయాణికులు వినియో గించుకోవాలని కోరారు. వరంగల్ వైపు నిజామాబాద్ నుంచి 6.00, 6.45, 7.30, 8.00, 9.00, 13.00, 13.45, 14.30, 15.00, 15.30, 16.00 గంటలకు, మెట్‌పల్లి నుంచి 7.30, 8.15, 9.00, 9.30, 10.00, 10.30, 14.30, 15.15, 16.00, 16.30, 17.00, 17..30 గంటలకు బయలుదేతుతోందన్నారు. కోరుట్ల నుంచి 7.45, 8.30, 9.15, 9.45, 10.15, 10.45, 14.45, 15.30, 16.15, 16.45, 17.15, 17.45 గంటలకు జగిత్యాల నుంచి 10.00, 10.45, 11.30, 12.00, 12.30, 13.00, 17.00, 17.45, 18.30, 19.00, 19.30, 20.00 గంటలకు, అదే విధంగా వరంగల్ నుంచి నిజామాబాద్‌కు 6.00, 6.45, 7.30, 8.00, 8.30, 9.00, 13.00, 13.45, 14.30, 15.00, 15.30, 16.00 గంటలకు డీలక్స్ బస్సులు బయలుదేరుతాయన్నారు. ఈ సర్వీసులు 13వ తేదీ గురువారం నుంచి ప్రారంభిస్తున్నామని, ప్రయాణికులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

కాంట్రాక్టరుపై కత్తితో దాడి

జ్యోతినగర్, జూన్ 12: ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌతమి నగర్‌లో బుధవారం మేకల మల్లేష్ అనే కాంట్రాక్టరుపై పాత నేరస్తుడు మేకల కుమార స్వామి కత్తితో దాడి చేశాడు. దాడికి పాల్పడిన కుమార స్వామి గతంలో జరిగిన కాంట్రాక్టరు మల్లేశ్ తమ్ముడు మేకల లింగయ్య హత్య కేసు లో ప్రధాన నిందితుడు. బాధితుడు మేకల మల్లేశ్ కథనం ప్రకారం వివరా లిలా ఉన్నాయి. కాంట్రాక్టరు మల్లేశ్ గోదావరిఖని నుంచి వస్తున్న క్రమంలో గౌతమి నగర్ వద్ద మేకల కుమారస్వామి తారసపడి మల్లేశ్ వాహనాన్ని ఆపి వాదనకు దిగాడని తెలిపాడు. తన ఇంటి వద్ద రెండుసార్లు ఎందుకు తిరిగా వంటూ మల్లేశ్ అడగడంతో కుమారస్వామి తన దగ్గర ఉన్న కత్తితో మల్లేశ్‌పై దాడి చేశాడన్నాడు. దీంతో తన జీపులో ఉన్న రాడ్డు తీసి బెదిరించడంతో పారిపోయాడన్నాడు. దీంతో మల్లేశ్ స్వల్పంగా గాయపడ్డాడు. ఈ మేరకు ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య

సుల్తానాబాద్, జూన్ 12: సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల రోడ్డుకు చెం దిన రమేష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి బానిసై తరచూ తాగి వచ్చి భార్యతో గొడవపడే. మంగళవారం రాత్రి కూడా భార్యభర్తల మధ్య గొడ వ జరిగింది. ఈ నేపథ్యంలో భార్య పక్కనే ఉన్న వారి మరో ఇంటిలో పడుకుం ది. బుధవారం తెల్లవారుజామున లేచి తన ఇంటికి రాగా భర్త రమేష్ (35) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రావణ్ తెలిపారు.

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఆలస్యం?

నీట్-2024పై రగడే కారణం!.. తెలంగాణలో 56 కాలేజీల్లో 8,515 ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యకు సంబంధించి ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. నీట్-2024పై దేశ వ్యాప్తంగా జరుగుతున్న రగడే ఇందుకు కారణం. నీట్ మార్కులపై ఇప్పటికే సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. నీట్-2024ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిల్‌ను కోర్టు తోసిపుచ్చింది. కానీ, నీట్ విషయంలో మరిన్ని కేసులు పడే అవకాశం ఉందని, విషయం అంత త్వరగా తేలేట్లుగా కనిపించడం లేదని జాతీయ వైద్య విద్య కమిషన్(ఎన్ఎంసీ) అధికారులు రాష్ట్ర వైద్య విద్య ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. మరోపక్క, దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, వాటిలోని సీట్ల వివరాలను ఎన్ఎంసీ తన వెబ్‌సైట్‌లో పెట్టింది. విద్యార్థులు ఆయా కళాశాలల్లోనే చేరాలనే పేర్కొంది. ఎన్ఎంసీ వెబ్‌సైట్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కలిపి తెలంగాణలో 56 వైద్య కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి.

కొత్త కాలేజీల సంగతేంటో?

రాష్ట్రం ప్రభుత్వం దరఖాస్తు చేసిన కొత్త వైద్య కళాశాలల అనుమతిపై ఎన్ఎంసీ ఏటూ తేల్చడం లేదు. అనుమతి ఇస్తారో ? ఇవ్వరో కూడా స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో కొత్త కళాశాలల్లో ఈ ఏడాది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం అనుమానంగానే ఉంది. గద్వాల, వరంగల్(నర్సంపేట్), యాదాద్రి, మేడ్చల్ (కుత్బుల్లాపూర్), నారాయణపేట్, ములుగు, మెదక్, రంగారెడ్డి(మహేశ్వరం) జిల్లాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టు- సెప్టెంబరులో ఎన్ఎంసీకి దరఖాస్తు చేసింది. ఆయా కళాశాలలను వర్చువల్‌గా, స్వయంగా తనిఖీ చేసిన ఎన్ఎంసీ బృందాలు పలు లోపాలను ఎత్తి చూపి వాటిని సరిచేసుకోవాలని సూచించాయి. ఆ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ లోపాలను సవరించింది. అయితే వైద్య కళాశాలలకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్ఓపీ) ఇచ్చేముందు ఎన్ఎంసీ బృందాలు మరోమారు తనిఖీ చేస్తాయి. మరికొద్ది రోజుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఎన్ఎంసీ బృందాలు ఇప్పటిదాకా మళ్లీ తనిఖీలకు రాలేదు. నిజానికి, తాము ఎత్తిచూపిన లోపాలను సరి చేసుకున్నట్టు చూపించిన తర్వాత వాటికి సంతృప్తి చెందితేనే ఎన్ఎంసీ అనుమతి ఇస్తుంది. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే ప్రభుత్వం అప్పీలు చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వ కళాశాల కాబట్టి సర్కారే గ్యారంటీగా ఉండి లోపాలను సవరించుకుంటామని లిఖితపూర్వక హామీనిస్తుంది. దాంతో ఎన్ఎంసీ అనుమతి మంజూరు చేస్తుంది. ఈ వ్యవహారానికి 20-30 రోజుల సమయం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. దీంతో త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ వైద్యవిద్య సంచాలకులు ఎన్ఎంసీకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎన్ఎంసీ ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. మరోపక్క, అనుమతుల విషయమై కొన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలు ఇప్పటికే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి చర్చినట్టు సమాచారం.

గ్రూప్-1 మెయిన్స్ 7 రోజులు

(మొదటిపేజీ తరువాయి)

మీడియంలోనే రాయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న సమయంలోనే ఏ మీడియంలో రాసేదీ తెలపాల్సి ఉంటుంది. ఒక పరీక్ష తెలుగులో, మరో పేపర్‌ను ఇంగ్లిష్‌లో రాయడానికి వీల్లేదు. అలా వేర్వేరు మాధ్యమాల్లో రాసినవారి పేపర్లను పరిగణనలోకి తీసుకోరు. రాష్ట్రంలో సుమారు 563 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను త్వరలోనే ప్రకటించనున్నారు. అందులో ఉత్తీర్ణులైనవారిని.. ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థుల చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేయనున్నారు. మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచే అభ్యర్థులను పోస్టులకు ఎంపిక చేస్తారు. ఈ నియామకాల్లో ఏలాంటి ఇంటర్వ్యూలూ ఉండవు. మెయిన్ పరీక్షలకు సంబంధించిన వివరాలను కమిషన్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..

ఇదీ షెడ్యూలు

తేదీ	పేపర్
అక్టోబరు 21	జనరల్ ఇంగ్లిష్
అక్టోబరు 22	జనరల్ ఎస్సే (పేపర్-1)
అక్టోబరు 23	చరిత్ర, కల్చర్ అండ్ జాగ్రఫీ (పేపర్-2)
అక్టోబరు 24	ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం-గవర్నెన్స్ (పేపర్-3)
అక్టోబరు 25	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ (పేపర్-4)
అక్టోబరు 26	సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ (పేపర్-5)
అక్టోబరు 27	తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ (పేపర్-6)

- పరీక్షల తొలిరోజు అయిన అక్టోబరు 21న క్వాలిఫైయింగ్ టెస్ట్ (జనరల్ ఇంగ్లిష్ పరీక్ష) నిర్వహించనున్నారు. అనంతరం ఇతర పేపర్ల పరీక్షలను నిర్వహిస్తారు. క్వాలిఫైయింగ్ టెస్ట్ కాకుండా మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లకు పరీక్షలను నిర్వహిస్తున్నారు.
- పరీక్షలన్నీ హైదరాబాద్, దాని చుట్టు పక్కల హెచ్ఎండీఏ పరిధిలోనే జరుగుతాయి.
- ప్రతిపేపర్‌లోనూ 150 మార్కులకు ప్రశ్నలుంటాయి.
- అభ్యర్థులు అన్ని పేపర్లూ రాయాల్సి ఉంటుంది. ఏ ఒక్క పరీక్షకు గైర్హాజరైనా ఆ అభ్యర్థులు రాసిన ఇతర పేపర్లను పరిగణనలోకి తీసుకోరు.
- క్వాలిఫయింగ్ పరీక్షను 10వ తరగతి ప్రమాణాలతో నిర్వహిస్తారు. ఇతర పేపర్ల పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను ఇప్పటికే ప్రకటించారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ కీ విడుదల

ఈ నెల 9వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కీని విడుదల చేశారు. గురువారం (13వ తేదీ) నుంచి 17వ తేదీ మధ్య ఈ కీ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. కీపై అభ్యంతరాలుంటే.. 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాల్సిందిగా అభ్యర్థులకు అధికారులు సూచించారు.

నేడు లాసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లాసెట్ ఫలితాలను ఈ నెల 13వ తేదీన విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. గురువారం సాయంత్రం 3.30 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు.

నేటి నుంచి రెండోదశ దోస్త్

డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించి 13వ తేదీ నుంచి రెండో దశ దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. మొదటి దశలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 15వ తేదీలో ముగియనుంది. 14,15వ తేదీల్లో అభ్యర్థులు తమ వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఔటర్.. బంగారు బాతే!

వాహనాల రద్దీతో నెల నెలా పెరుగుతున్న ఆదాయం

- ఏప్రిల్‌లో రూ.60 కోట్లు..
- మే నెలలో 62.7 కోట్ల రాబడి



హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు.. ఆదాయ పరంగా బంగారు బాతు అన్నది స్పష్టమవుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీతో ఆదాయం భారీగా పెరుగుతోంది. ప్రతి నెలా హెచ్ఎండీఏ అధికారులు ఊహించని స్థాయిలో రాబడి వస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇచ్చే సందర్భంలో ఓ ప్రైవేటు ఏజెన్సీ మదింపు చేసిన ఆదాయ అంచనాలన్నీ తలకిందులవుతున్నాయి. అప్పుడు.. ఏడాదికి 2శాతం నుంచి 3శాతం వరకు ఆదాయం పెరుగుతుందని అంచనాలు వేయగా, ప్రస్తుతం ఒక్కో నెలకే 4శాతానికి పైగా పెరుగుతోంది. టోల్ చార్జీలు పెంచక ముందే ఆదాయం ఈ స్థాయిలో పెరుగుతుండడంతో.. చార్జీల పెంపుతో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఔటర్ ఆదాయంపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలు అక్షరసత్యాలు అని నిరూపితమవుతున్నాయి. గతేడాది ఔటర్ రింగ్ రోడ్డును హెచ్ఎండీఏ గత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏటేటా భారీ ఆదాయాన్ని సమకూర్చే ఔటర్‌ను చాలా తక్కువ బిడ్‌కు 30 ఏళ్లకు లీజుకివ్వడాన్ని ప్రస్తావిస్తూ.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతోపాటు ఔటర్‌పై ఏటా పెరిగే ఆదాయ, వ్యయాలను అంచనా వేసి చూపిస్తూ.. రాష్ట్రానికి బంగారు బాతు లాంటి ఔటర్‌ను ప్రైవేటుపరం చేయడాన్ని పేర్కొంటూ 'బంగారు బాతు.. బలి' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ కథనాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతోపాటు అప్పటి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. విపక్షాలకు అస్త్రంగా మారాయి. ఆ కథనాలన్నీ ఇప్పుడు అక్షరసత్యాలుగా నిరూపితమవుతున్నాయి.

టోల్ చార్జీల పెంపుతో సంబంధం లేకుండానే

ఔటర్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించిన సందర్భంలో ఆదాయాన్ని మదింపు చేసిన ఏజెన్సీ. ఏటా 2శాతం నుంచి 3శాతానికి అటు, ఇటుగా రాబడి పెరుగుతుందని అంచనాలు వేసింది. ముఖ్యంగా హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) ప్రకారం ఏటా టోల్ చార్జీల్లో చోటుచేసుకునే 4శాతం నుంచి 5శాతం పెంపుదల మేరకే ఆదాయం పెరుగుతుందని ఆ ఏజెన్సీ తేల్చింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చే టోల్ చార్జీలతో ఆ ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పెరుగుతుందని హెచ్ఎండీఏ అధికారులు కూడా అంచనాలు వేశారు. కానీ, ప్రస్తుతం టోల్ చార్జీలు పెంచకుండానే ప్రతి నెలా ఆదాయం పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.60.2 కోట్ల ఆదాయం రాగా, మే నెలలో రూ.62.7 కోట్లు వచ్చింది. అంటే దాదాపు రూ.2.5 కోట్లు పెరిగింది. ఒక్క నెలకే 4.2 శాతం పెరుగుదల నమోదైంది. ఈ పెరుగుదల గతేడాది నుంచి కొనసాగుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుండడంతో ఆ మేరకు ఆదాయం పెరుగుతోంది. కాగా, డబ్ల్యూపీఐ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచే పెరగాలి. కానీ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని పెంచకుండా నిలిపివేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో టోల్ చార్జీలు పెంచుకోవడానికి అవకాశం కల్పించారు. దాంతో ఈ చార్జీలు 4శాతం నుంచి 5శాతం మేర పెరిగాయి. ఇందుకు అనుగుణంగా ఆదాయం పెరుగుతుందని, వాహనాల రద్దీ ద్వారా వచ్చే ఆదాయం అదనంగా ఉంటుందని హెచ్ఎండీఏ- హెచ్‌జీసీఎల్‌కు చెందిన ఓ అధికారి తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కథలాపూర్, జూన్ 12: పొలం వద్ద ఓ వ్యక్తికి దారి ఇవ్వనం దుకు తనకు జరిమానా విధించారని మనస్థాపం చెందిన దుంపెట కు చెందిన అరిగెల రాజేశం (35) అనే రైతు బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎస్సై నవీన్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అరిగెల రాజేశం పొలం వద్ద కొంత కాలంగా దారి గురించి వివాదం కొనసాగుతోంది. రాజేశం భూమి నుంచి దారి ఇవ్వాలని పక్కనే ఉన్న రైతు కోరగా రాజేశం నిరాకరించాడు. దీంతో పంచాయతీ పెట్టి రాజేశంకు జరి మానా విధించడం వల్ల తీవ్ర మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నం చేశా డు. వెంటనే కథలాపూర్ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారని చెప్పారు. ప్రాథమికంగా వచ్చిన సమాచారం మేరకు బాధితుని నుంచి వివరాలు సేకరించామని ఎస్సై తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

కొడిమ్యాల, జూన్ 12 : మండలంలోని చెప్యాల గ్రామ శివారులో బుధవారం మధ్యాహ్నం ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా అక్రమంగా నల్ల మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌తో పాటు జేసీబీని పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు అనుమతి లేకుండా జేసీబీతో ట్రాక్టర్‌లో మట్టిని తరలిస్తుండగా వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. సంబందిత వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇసుక, నల్ల మట్టిని అనుమతి లేకుండా తరలిస్తే వాహనాలను సీజ్ చేసి, కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఊరట

జీఓ నెం.970 తప్పిదాలపై ముఖ్యమంత్రి రేవంత్ సీరియస్

సరిచేసిన ప్రభుత్వం... జీఓ నెం.1037 జారీ

పాత జీఓల ప్రకారమే నాన్ పీహెచ్ వర్కర్లకు వేతనాలు

కోల్‌సిటీ, జూన్ 12: మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల వేతనాలకు సంబంధించి జీఓ నం.970లో జరిగిన పొరపాట్లను సవరించింది. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం జీఓ నం. 1037జారీ చేసింది. జీవో నం.970లో నాన్ పీహెచ్ వర్కర్లకు సంబంధించి అనెక్స్-2లో పేర్కొన్న వివరాలపై స్పష్టతనిచ్చింది. గతంలో జారీచేసిన జీవో 14,60,63 ప్రకారమే వేతనాలు చెల్లిస్తారని, ఆ జీవోలనే పరిగణనలోకి తీసుకోవాలంటూ పేర్కొన్నది. ఈ మేరకు ఫైనాన్స్ విభాగం జాయింట్ సెక్రటరీకే హరిత ఆదేశాలు జారీచేశారు.

రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో పనిచేస్తున్న 30955మంది అవుట్ సోర్సింగ్ కార్మికుల వేత నాలకు సంబంధించి ప్రభుత్వం గత నెల 5న జీవో నం.970 జారీ చేసింది. ఈ జీఓను అనుసరించి పీహెచ్ వర్కర్లకు, నాన్ పీహెచ్ వర్కర్లకు కేవలం రూ.16,600వేతనాలు చెల్లిస్తారని పేర్కొన్నది. దీంతో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, నాన్ పీహెచ్ వర్కర్లు ఆందోళనకు గురయ్యారు. శానిటేషన్ విభాగంలో కూడా డ్రైవర్లు, సూపర్‌వైజర్లు, మంచినీటి సరఫరా విభాగంలో ఎలక్ట్రిషియన్లు, ప్లంబర్లు, ఫిట్టర్లు, టెక్నికల్, నాన్ టెక్నికల్ స్టాఫ్, కార్యాలయాల్లో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితర ఉద్యోగులు ఆందోళనకు లోనయ్యారు.

ప్రస్తుతం వీరికి రూ.19500 నుంచి రూ.23 వేల వరకు వేతనాలు చెల్లిస్తుండగా కొత్త జీవోతో రూ.16600 పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఆంధ్రజ్యోతిలో మున్సిపల్ కార్మికులకు షాక్ శీర్షికన కథనం ప్రచురితమైంది. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ సైతం ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జీవో పరిణామాలపై ఆరా తీసి వెంటనే సరి దిద్దాల్సిందిగా ఆదేశించినట్టు సమాచారం. మున్సిపల్‌శాఖ దీనిపై వివరాలను తెప్పించుకున్నది. మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయం ఈనెల 10న ఆర్‌వోసీ 704292/2024/కే2 ద్వారా ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ లేఖను అనుసరించి జీవో నం.970లో సవరణలు చేస్తూ బుధవారం జీవో ఆర్‌టీ నెం.1037ను ప్రభుత్వం జారీ చేసింది. దీంతో రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికులు వేతనాలు యథావిధిగా పొందనున్నారు.

నెత్తురోడిన రహదారి

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి
- కామారెడ్డి జిల్లా వాసులుగా గుర్తింపు


అబ్దుల్లా (ఫైల్)


సయ్యద్ చాంద్ (ఫైల్)

గంభీరావుపేట, జూన్ 12: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం పెద్దమ్మ బస్ స్టేజీ సమీపంలో మూల మలుపు వద్ద బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతులను కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం మల్లుపల్లికి చెందిన షేక్ అబ్దుల్లా (32), సయ్యద్ చాంద్ (38)గా గుర్తించారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మల్లుపల్లికి చెందిన అబ్దుల్లా గల్ఫ్ వెళ్లేందుకు వీసా ప్రయత్నంలో ఉన్నాడు. వీసా ఇంటర్వ్యూకు వెళ్లేందుకు అదే గ్రామానికి చెందిన సయ్యద్ చాంద్‌తో కలిసి బైక్‌పై సిరిసిల్ల బయల్దేరారు. గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజీ దాటగానే మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీ కొట్టడంతో ప్రమాదం సంభవించింది. చాంద్ వ్యాన్ ముందు టైర్ల కింద పడి మరణించగా, అబ్దుల్లా డీసీఎం వ్యాన్ బంపర్ తగిలి మృతిచెందాడు. డీసీఎం వ్యాన్ డ్రైవర్ అజాగ్రత్తగా, అతి వేగంగా నడపడంతో ప్రమాదం జరిగిందని అబ్దుల్లా భార్య జయిరాం బీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, స్థానిక ఎస్సై రాంమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి


అశ్విత (ఫైల్)

బీర్‌పూర్,జూన్ 12: మండల కేంద్రానికి చెందిన 9వ తరగతి చదువుతున్న అశ్విత (14) మంగళవారం రాత్రి విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు ఏఎస్ఐ రవీందర్ తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సముద్రాల సతీష్ సునీతల కుమార్తె అశ్విత మంగళవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో కాలకృత్యా లు తీర్చు కోవడానికి వెళ్లింది. తిరిగి వస్తుండగా బాత్ రూమ్ ఇనుప డోరుకు విద్యుత్ సరఫరా కావడంతో డోర్‌ను తీస్తున్న క్రమంలో షాక్ తగిలి అశ్విత మృతి చెందింది. అశ్విత తల్లి సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతురాలు తండ్రి సతీష్ జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. అశ్విత మృతిని తట్టుకోలేక స్నేహితులు కన్నీరు మున్నీరుతో విలపించారు.

రామగుండం ఎన్టీపీసీలో ప్రమాదం

వలస కార్మికుడి మృతి


అర్జున్ మరాండి(ఫైల్)

జ్యోతినగర్, జూన్ 12 : రామగుండం ఎన్టీపీసీ ప్లాంటులో బుధవారం జరిగిన ప్రమాదంలో అర్జున్ మరాండి (37) అనే ఒడిశా వలస కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. ప్రాజెక్టులోని 6వ యూనిట్ యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్(ఏహెచ్‌పి)లో ఈఎస్‌పీల ఆధునికీకరణ పనులు చేస్తున్న క్రమంలో 17 మీటర్ల ఎత్తు నుంచి కింద పడడంతో ఈ ప్రమాదం జరిగింది. తలకు, శరీర భాగాలకు బలమైన గాయాలు తగలడంతో అర్జున్ అక్కడికక్కడే చనిపోయాడు. ఎత్తైన చిమ్నీపై పని చేస్తున్న సమయంలో సేఫ్టీ రోప్ పెట్టుకున్నప్పటికీ కింద పడి చనిపోయాడు. ఒడిశా రాష్ట్రానికి చెందిన అర్జున్ మరాండి ప్రభాత్ ఇంజ నీరింగ్ కంపెనీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నా డు. ప్రమాద సంఘటన తెలుసుకున్న ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంగాల జేఏసీ నాయకులు ఎన్టీపీసీ ఆసుపత్రికి తరలివెళ్లారు. మృతుడి కుటుంబానికి 50 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, అంత్యక్రియలకు లక్ష రూపాయలు ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాయంత్రం వరకు కాంట్రాక్టు సంస్థ, జేఏసీ, యాజమాన్యం మధ్య జరిగిని చర్చలు జరిగాయి. అర్జున్ మరాండి కుటుంబానికి ఎన్టీపీసీ తరుపున ఇన్సురెన్సు కింద 10 లక్షల రూపాయలు, ప్రభాత్ కంపెనీ నుంచి 6 లక్షల రూపాయలు, లక్ష రూపాయలు దహన సంస్కారాలకు నెలరోజుల్లో చెల్లించేదుకు అంగీకారం కుదిరింది. అలాగే వర్క్‌మెన్ కాంపెన్‌సెషన్ స్కీం కింద మరో 15 లక్షలకు పైగా ఎక్స్‌గ్రేషియా వచ్చే అవకాశ ముంది. కాగా, సంఘటన స్థలాన్ని రామగుండం సీఐ అజయ్‌బాబు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ టీచర్ల బడిబాట



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

గంభీరావుపేట, జూన్ 12: గంభీరావుపేట మండలం నర్మాలలో బుధవారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ బడి బాటలో భాగంగా ఇంటింటికి వెళ్లి పిల్లల పేర్లు నమోదు చేసుకున్నారు. చిన్నారులకు అంగన్‌వాడీ సెంటర్లలోకి తీసుకొచ్చి అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో అలేఖ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, అంజలి ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నాయకుడు

ఎల్లారెడ్డిపేట, జూన్ 12: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామంలోని రేవంత్ మిత్ర మండలి, టీం రేవంత్‌రెడ్డి జిల్లా అధ్యక్షుడు గూడ విజయ్‌రెడ్డి హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు. సిరిసిల్ల జిల్లాలో నెలకొన్న సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దాంతో సీఎం సానుకూలంగా స్పందించారని విజయ్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ కోసం పదేళ్లు కష్టపడుతున్న విజయ్‌రెడ్డికి జిల్లా స్థాయి నామినేటెడ్ పోస్టు కేటాయించేలా చూస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

మంత్రి పొన్నంను కలిసిన కాంగ్రెస్ యువనేత

గంభీరావుపేట, జూన్ 12: హైదరాబాద్‌లోని మినిస్టరీ క్వార్టర్స్‌లో బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను గంభీరావుపేట మండలం కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు గుర్రం రాజుగౌడ్ బుధవారం కలిశారు. కొత్తపల్లికి బస్‌లు సరిగా రావడం లేదని, విద్యార్థులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు. స్పందించిన మంత్రి కామారెడ్డి, దుబ్బాక డిపోల నుంచి రెండు ఏసీ బస్సుల చొప్పున కొత్తపల్లికి వచ్చేందుకు అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధ్యతారాహిత్యంగా రాజన్న ఉద్యోగుల తీరు

వేములవాడ టౌన్, జూన్ 12 : రాజన్న ఆలయ ఉద్యోగుల తీరుతో ఓ రాష్ట్ర స్థాయి అధికారి నొచ్చుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ఇటీవల వచ్చిన సదరు అధికారికి ఆలయ ఉద్యోగులు, అర్చకులు ఆశీర్వచనం, స్వామివారి శేష వస్త్రం అందించారు. ఇంటికెళ్లి చూడగా శేష వస్త్రం కాస్త చినిగి పోయి ఉండడంతో ఆలయ ఈవోకు విషయం చెప్పి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త పడుతామని ఈవో విచారణ వ్యక్తం చేశారు. ఏఈవో స్థాయి అధికారితో అర్చకులను సదరు అధికారి ఇంటికి పంపించి ఆశీర్వచనం, స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేసినట్లు తెలిసింది.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డిపేట, జూన్ 12: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలో యువకుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్ ఎస్సై రమాకాంత్ బుధవారం అందజేశారు. గత నెల 29న ఫిరోజ్ అనే యువకుడు సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడని, ఐఎంఈఐ నంబర్ ద్వారా కనుగొని బాధితుడికి సెల్‌ఫోనును అందించామని ఎస్సై పేర్కొన్నారు.

చిన్నారి మృతిపై వైద్యాధికారుల విచారణ

ఎల్లారెడ్డిపేట, జూన్ 12:ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో టీకా వికటించి ఈ నెల 3న నాలుగు నెలల చిన్నారి అన్విశ్రీ మృతి చెందిందని, చర్యలు తీసుకోవాలని పేర్కొంటూ తల్లిదండ్రులు బుర్క కైరుబీ అలియాస్ ఇషిత- రాకేశ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర అధికారి అతుల్‌నిగామా ఆధ్వర్యంలోని వైద్య బృందం సీహెచ్‌సీలో విచారణ చేపట్టారు. స్థానిక వైద్య సిబ్బంది, తల్లిదండ్రుల ద్వారా వివరాలను సేకరించారు. తమ కూతురు ఆరోగ్యంగానే ఉందని, టీకా వేసిన రోజు నుంచి జ్వరంతోపాటు రెండు రోజులకు విరేచనాలు ప్రారంభమయ్యాయని తల్లిదం డ్రు లు వివరించారు. పాప మృతిపై విచారణ జరిపామని, నివేదికను కలెక్టర్‌కు అందజేశామని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు వెల్లడించారు. జిల్లా డిప్యూటీ వైద్యాధికారి రజిత, పిల్లల వైద్యులు సురేశ్, మానసిక వైద్యులు ప్రవీణ్‌కుమార్, జనరల్ ఫిజీషియన్ సల్మానిషాత్, ప్రోగాం అధికారి నయీమ్‌జాన్ ఉన్నారు.

దర్గాలో కందూరు వేడుకలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 12: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ శివారులోని సత్తేపీరీల దర్గాలో ముస్తాబాద్ మండలం ఆవునూర్ గ్రామానికి చెందిన ఆటో యూనియన్ సభ్యులు బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు. కార్యక్రమంలో సభ్యులు కనకయ్య, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంట పెట్టుబడి సాయం అందించాలి

ముస్తాబాద్, జూన్ 12 : రైతులకు పంట పెట్టుబడి సాయాన్ని వెంటనే అందించాలని రైతు బంధు మండల మాజీ అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్ రావు ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులు ఇప్పటికే వానాకాలం సాగు పనులను ప్రారంభించారని తెలిపారు. పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ చేయాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ముస్తాబాద్, జూన్ 12 : ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇతరులు ఆర్థిక సాయం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు ఆధ్వర్యంలో సామాజిక మాధ్యమాల్లో చేసిన విజ్ఞప్తి మేరకు కార్యకర్తలు, నాయకులు స్పందించారు. నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి రూ.5వేల ఆర్థిక సాయం అందించడంతో పాటు, ముస్తాబాద్ మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో రూ 30 వేల ఆర్థికసాయం, క్వింటాల్ బియ్యాన్ని బాధిత కుటుంబానికి అందించారు. పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, బీసీ సెల్ మండల అధ్యక్షులు శీల ప్రశాంత్, మీడియా మండల కన్వీనర్ ఎదూనూరి భానుచందర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మిరుదొడ్డి భాను, పట్టణ అధ్యక్షుడు ఎద్దండి మహేందర్‌రెడిడ్డి, నాయకులు ఆగుళ్ల రాజేశం, ఉచ్చిడి బాల్‌రెడ్డి, తలారి నర్సయ్య, వెంకటి, భరత్, ముచ్చర్ల శ్రీనివాస్, కొండయ్య సారుగు వెంకటేశ్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

తంగళ్లపల్లి, జూన్ 12: తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనికి చెందిన వేముల కిషన్(42) అనారోగ్యంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. కొద్ది సంవత్సరాలుగా కిషన్ టీబీ, షుగర్ వ్యాధులతో బాధపడుతున్నాడు. పదేళ్ల క్రితం కిషన్‌ను వదిలేసిన భార్య ఇద్దరు పిల్లలతో తన తల్లిగారింటి వద్ద ఉంటోంది. కిషన్ తన తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. అనారోగ్యంతోపాటు తల్లిదండ్రులకు భారం అవడంతో మనస్తాపం చెంది బుధవారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లీకొడుకుల అదృశ్యం.. కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, జూన్ 12: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని వివాహిత మారుపాల దీపిక మూడేళ్ల కొడుకు నవనీత్‌తో కలిసి అదృశ్యమైనట్లు, కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ బుధవారం రాత్రి తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని శ్రీనివాస్‌కు ఐదేళ్ల కిందట దీపికతో వివాహమైంది. మూడేళ్ల వయసు ఉన్న కొడుకు నవనీత్ ఉన్నాడు. ఈ నెల 11న రాత్రి దీపిక కొడుకు నవనీత్‌ను తీసుకొని బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన ఆమె భర్త స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోరుట్లలో చోరీ

కోరుట్ల, జూన్ 12 : పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో చోరీ జరిగింది. బస్సు ఎక్కుతున్న మహిళ హ్యాండ్ బ్యాగ్ అపహరణకు గురైనట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మెట్‌పల్లి పట్టణంలోని గాజులపేటకు చెందిన తెడ్డు మేఘన ఇద్దరు పిల్లలతో ఆర్టీసీ బస్సులో మెట్‌పల్లి నుంచి కోరుట్ల మీదుగా కథలాపూర్‌కు వెళుతుండగా, కోరుట్ల బస్టాండ్‌లో దిగి మరో బస్సు ఎక్కుతున్న సమయంలో హ్యాండ్ బ్యాగును గుర్తు తెలియని వ్యక్తులు దొంగ లించినట్లు తెలిపింది. బ్యాగులో 6 తులాల వెండి, 4 తులాల బంగారు ఆభర ణాలు ఉన్నాయని మేఘన పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేట్‌తో పోటీపడేలా ప్రభుత్వ పాఠశాలలు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, జూన్ 12: కార్పొరేట్‌తో పోటీపడేలా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు ముందుకు సాగుతున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని మర్రిపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు యూనీఫామ్‌లు, పుస్తకాలు, నోట్ బుక్‌లను పంపిణీ చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఒక్కరికి విద్యనందించాని ఏ ఒక్కరు విద్యకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను పటిష్ఠం చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వమే విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్‌లు, పుస్తకాలు, నోట్‌బుక్స్ అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసించి పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్మానించారన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర చరిత్రలోనే పాఠశాల ప్రారంభం రోజు విద్యార్థులకు యునిఫామ్, నోట్ బుక్స్ పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రారంభించి ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపారన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రమేష్, ఎంపీపీ బండ మల్లేశం, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నోట్‌బుక్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

● సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

బోయినపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు వినియోగించుకోవాలని, ఉన్నత చదువులు చదువుకోవాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా యూనిఫామ్, పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మట్టిలో మాణిక్యాలు మన విద్యాకుసుమాలని, లక్ష్య సాధనకు లక్షల రూపాయల ఫీజులు కట్టి కార్పొరేట్ స్కూళ్లకే వెళ్లక్కర్లేదు అన్నారు. సర్కారు బడిలో చదివి కూడా సత్తా చాటగలమని నిరూపించాలని విద్యార్థులకు సూచించారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాను 5వ తరగతిలో నేను ఎమ్మెల్యే కావాలని కోరుకున్నాని, మీరు కూడా ప్రతి ఒక్కరి మంచి లక్ష్యం వైపు నడవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులు వినియోగించుకొని పిల్లలని ప్రభుత్వ పాఠశాల చదివించాలని అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, మాజీ డీసీఎంఎస్ ముదిగంటి సురేందర్ రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్, తహసిల్దార్ పుష్పలత ఎంపీడీవో జయశీల, మండల విద్యాధికారి శ్రీనివాస్ దీక్షితులు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతి గౌడ్, ఎంపీటీసీ అక్కనపల్లి ఉపేందర్,జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు కూస రవీందర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఏనుగుల కనకయ్య,జోగు, సురేందర్ ,రామిరెడ్డి శ్రీనివాస్ ,సందిసంపత్ కుమార్, సంబ లక్ష్మీరాజం, బండారి రాములు, ఏనుగుల ప్రశాంత్, నాగుల వంశీ, నిమ్మ వినోద్ రెడ్డి, బోయిని ఎల్లేష్, అక్కనపల్లి కరుణాకర్, అమ్మిగల్ల గోపాల్,రాజు, మొండయ్యా, శాలివాహన శ్రీనివాస్, రాకేష్,మంద వెంకటేష్, లాల్ కనకయ్య శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: వేములవాడ పట్టణంతోపాటు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఉచిత పుస్తకాలను, యూనిఫాంను పంపిణీ చేశారు. పట్టణంలో గర్ల్స్ హైస్కూల్‌తో పాటు నాంపల్లి, రుద్రవరం, సంకెపల్లి, అనుపురం, మారుపాక, చింతలఠాణ చీర్లవంచ గ్రామాల్లో విద్యార్థులకు అందించినట్లు తెలిపారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం ఉచిత యూనిఫాం, పుస్తకాలను ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందజేశారు. తంగళ్లపల్లి పాఠశాలలో ఎంపీపీ పడిగెల మానస రాజు, మండేపల్లిలో ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్, మాజీ సర్పంచ్ గణప శివజ్యోతి,హెచ్‌ఎం ఆరాధన, ఒబులాపూర్ పాఠశాలలో హెచ్‌ఎం బండి ఉపేందర్, నేరెళ్ల పాఠశాలలో కమిటీ చైర్మన్ మారవేణి లక్ష్మీ హెచ్‌ఎం దుబ్బాక ప్రభాకర్ పాల్గొన్నారు., పుస్తకాలు పంపిణీ చేశారు.

వీర్నపల్లి: సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యతోపాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజన సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని ఎంపీపీ మాలోతు భూల అన్నారు. వీర్నపల్లి మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న పాఠ్యపుస్తకాలను స్థానిక ఎంపీటీసీ అరుణ్ కుమార్, ఉపాధ్యాయులతో కలిసి బుధవారం అందించారు. ప్రధానోపాధ్యాయులు తుమ్మ శ్రీనివాస్, వేముల శ్రీనివాస్, కదిరి శ్రీనివాస్, నాయకులు సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని జడ్పీటీసీ గుండం నర్సయ్య అన్నారు. మండలంలోని ఆవునూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యునిఫాంలు, నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సౌల్ల లలిత, ఎస్ఎంసీ చైర్మన్ బత్తుల లలిత, హెచ్‌ఎం యాదగిరి, పద్మ, క్రాంతి పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేశారు. రేపాక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని రేవతిదేవి మాట్లాడుతూ అన్ని వసతులు ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలన్నారు. మధ్యాహ్న భోజనంతోపాటు నోట్‌బుక్‌లు అందిస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు సింగిరెడ్డి వీరారెడ్డి, రామేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

చందుర్తి: ప్రభుత్వ పాఠశాలల్లోని నాణ్యమైన విద్య లభిస్తుందని చందుర్తి ఎంపీపీ బైరగోని లావణ్య, జడ్పీటీసీ నాగం కుమార్ అన్నారు. నర్సింగాపూర్, మరిగడ్డ, మూడపల్లి, గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠ్యపుస్తకాలను, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. మరిగడ్డ ఎపీటీసీ దారం కావ్యశ్రీ- బాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు జితేందర్, వినయ్ కుమార్, మల్లేశం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు కవిత, అనిత, నాయకులు రమేష్,రవీందర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



యూనిఫాం అందజేస్తున్న జడ్పీటీసీ గుండం నర్సయ్య



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

ఎల్లారెడ్డిపేట, జూన్ 12: విద్యుత్ సమస్యలను సెస్ అధికారులు పరిష్కరించాలని ఎల్లారెడ్డిపేటకు చెందిన వినియోగదారులు, రైతులు డిమాండ్ చేశారు. బుధవారం సెస్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. సమస్యలను ఎందుకు తీర్చరంటూ ఏఈ పృథ్వీధర్‌ను నిలదీశారు. పొలాల్లో వంగిన విద్యుత్ స్తంబాలు, కిందకు వేలాడుతున్న తీగలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. పలుమార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో హై ఓల్టేజీ, లో ఓల్టేజీతో ఇళ్లలోని విద్యుత్ పరికరాలు కాలిపోతున్నాయని వినియోగదారులు పేర్కొన్నారు. ఒక్కరే హెల్పర్ విధులు నిర్వహించడంతో సమస్యను పరిష్కరించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. గృహజ్యోతి పథకం అందరికీ వర్తింపజేయాలన్నారు. మూడు నెలలపాటు జీరో బిల్లులు వచ్చి ప్రస్తుతం బిల్లు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకుడు బాలరాజుయాదవ్, నాయకులు, రైతులు సంతోష్‌గౌడ్, తిరుపతిగౌడ్, బాలయ్య, శ్రీనివాస్, గోపి, మురళీ, రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దేవయ్య, అరుణ్‌కుమార్, కల్యాణ్, సంతోష్‌రెడ్డి, అనిల్, నర్సయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు

కోడెమొక్కు చెల్లించుకున్న టీడీపీ నేతలు



కోడెమొక్కు చెల్లించుకుంటున్న టీడీపీ నేతలు

వేములవాడ టౌన్, జూన్ 12: ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా టీడీపీ నేతలు బుధవారం వేములవాడ రాజరాజేశ్వర్వామి ఆలయంలో కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారాచంద్రబాబు నాయుడు, మంత్రిగా పవన్ కళ్యాణ్ ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు చింతలకోటి రామాస్వామి, దేవయ్య, నర్సయ్య, ఎఢెంకటేశం, భూమయ్య లచ్చిరెడ్డి ఉన్నారు.

ఒకరి అరెస్టు

కోనరావుపేట, జూన్ 12: భూమి నకిలీ పాసుబుక్‌లను తయారు చేసి మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన ముస్కరి కాశీరాం కొన్ని రోజులు కోనరావుపేట తహసీల్దార్ కార్యాలయంలో సుంకరిగా పనిచేశాడు. పాస్‌బుక్‌లు ఆన్‌లైన్‌పైన తనకు అనుభవం ఉందని అధికారులతో సంబంధాలు ఉన్నాయని పలువురిని నమ్మించాడు. నకిలీ పాసుబుక్ తయారీ చేసి భూములను ఆన్‌లైన్‌లో చేసి ఇస్తానని మోసాలకు పాల్పడ్డాడు. మండల కేంద్రానికి చెందిన దుండగల కనకయ్య వద్ద మూడు ఎకరాలకు పట్టా పాసుబుక్ చేసి ఇస్తానని లక్ష రూపాయలు తీసుకున్నాడు. గతంలోని పాత పాసుబుక్‌ను అందజేశాడు. కాశీరాం నమ్మించి పలువురి వద్ద ఇలా మోసం చేస్తున్నాడని వచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు నిందితుడు కాశీరామును రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు. కోనరావుపేట ఎస్సై అంజనేయులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కోనరావుపేట, జూన్ 12: కోనరావుపేట మండలం మంగళపల్లి గ్రామంలో మాజీ మండల సర్పంచుల ఫోరం కన్వీనర్, మంగళ పల్లె మాజీ ఉపసర్పంచ్ అవురం శరత్ తల్లి రాజవ్వ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు బుధవారం పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు, ఎంపీపీ చంద్రయ్య గౌడ్, రాఘవరెడ్డి, వెలిశాల సంతోష్, ఉప్పుల శ్రీనివాస్, సీతారాం, మధు, వినోద, మహేష్, విజయ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

బియ్యం అందజేత

తంగళ్లపల్లి, జూన్ 12: తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన కుచన శ్రీనివాస్ కుటుంబానికి, ఇందిరనగర్‌కు చెందిన అన్నరాశీ కనకయ్య కుటుంబాలకు ఉప సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పెద్దూరి తిరుపతి బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆసాని సత్యనారయణరెడ్డి, పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాపెల్లి ఆనందం, నాయకులు నేరళ్ల నర్సింగం, లింగాల భూపతి, రెడ్డి పర్శరాములు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు పునఃప్రారంభం



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రేణుక

ఎల్లారెడ్డిపేట, జూన్ 12: ఎల్లారెడ్డిపేట మండలంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు బుధవారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, బొప్పాపూర్, వెంకటాపూర్, పదిర, హరిదాస్‌నగర్, అల్మాస్‌పూర్, అక్కపల్లి, దుమాల, తదితర గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధాన ద్వారాలను అందంగా తీర్చిదిద్దారు. విద్యార్థులకు స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులను తల్లిదండ్రులు స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో విద్యార్థులకు దుస్తులు, పాఠ్య పుస్తకాలను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎంపీపీ రేణుక పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందన్నారు. విద్యార్థులకు ఆధునిక వసతులతో కూడిన చదువుకు ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని ఎంపీపీ రేణుక సూచించారు. కార్యక్రమంలో ప్యాక్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, గీతాంజలి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి బాబు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రానికి సినారె పేరు పెట్టాలి


వేములవాడ రూరల్, జూన్ 12: వేములవాడ రూరల్ మండల కేంద్రంగా హన్మాజిపేట గ్రామాన్ని ప్రకటించాలని, మండలానికి సినారె పేరును పెట్టాలని పలు గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. బుధవారం హన్మాజిపేటలో సినారె వర్ధంతి వేడకల్లో పాల్గొనడానికి వచ్చిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో మండల కేంద్రంగా చెక్కపల్లి గ్రామాన్ని ప్రకటించారని, దానిని వ్యతిరేకించడంతో వాయిదాపడిందని అన్నారు. వేములవాడ రూరల్ మండలానికి మండల కేంద్రం లేనందున్న ప్రజలందరికీ సౌకర్యంగా ఉండే హన్మాజిపేటను మండల కేంద్రంగా ప్రకటించాలన్నారు. స్థానిక ఎంపీటీసీ సామ కవిత తిరుపతిరెడ్డి, నాయకులు సామ కవితతిరుపతిరెడ్డి, వీరారెడ్డి, రవీందర్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ హనుమాజిపేట, లింగంపల్లి, బొల్లారం, మల్లారం గ్రామస్థులు పాల్గొన్నారు.



వినతి ప్రతం అందజేస్తున్న గ్రామస్థులు

సమష్టి కృషితోనే మండల అభివృద్ధి

రుద్రంగి, జూన్ 12: ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితోనే రుద్రంగి మండలం అభివృద్ధి చెందిందని ఎంపీపీ గంగం స్వరూపరాణి అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఎంపీపీ గంగం స్వరూపరాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చివరి సమా వేశం కావడంతో వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. దీంతోపాటు ఐదు సంవత్సరాల్లో చేపట్టిన పనులపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ గంగం స్వరూపరాణి మహేష్ మాట్లాడుతూ రుద్రంగి మండలంలో రెండు నియో జకవర్గాలు ఉన్నా వేములవాడ మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు, బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి సహకారంతో రుద్రంగి మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని, అధికారులకు ఏం పని చెప్పిన వెంటనే చేశారని గుర్తు చేశారు. కోరుట్ల - వేములవాడ రూట్‌లో అదనంగా మరో రెండు ఆర్టీసీ బస్సులను వేయాలని సంస్థ అధికారులను కోరారు. అనంతరం ఎంపీపీ గంగం స్వరూపరాణి మహేష్, వైస్ ఎంపీపీ పిసరి చిన్న భూమయ్యకు అధికారులు శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, వైస్ ఎంపీపీ పిసరి చిన్న భూమయ్య ఎంపీడీవో నటరాజు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎంపీపీ గంగం స్వరూపరాణి

చెరువుల్లో మట్టి తరలింపుపై ఆగ్రహం

వాడీవేడిగా మండల సర్వ సభ్య సమావేశం

తంగళ్లపల్లి, జూన్ 12: అనుమతి లేకుండా చెరువుల్లో మట్టి తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ కర్కబోయిన కుంటయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తంగళ్లపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పడిగెల మానస రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం పంట పరిహారం చెల్లించినప్పటికీ ఎజెండాలో ఎందుకు పొందుపర్చలేదని వ్యవసాయశాఖాధికారిని ఎంపీటీసీ భైరినేని రాము ప్రశ్నించారు. 310 మంది రైతుల పరిహారం బ్యాంకు అకౌంట్‌లలో జమైనట్లు తెలిపారు. అలాగే చిన్నలింగపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని దానిపై దృష్టి సారించాలని అన్నారు. పంట సాగు మెదలు పెట్టి రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు రైతు బంధు రాలేదని ఎంపీటీసీ కుంటయ్య సభ దృష్టికి తీసుకువచ్చారు. విదుత్ వైర్లతో జిల్లెల్ల, ఇందిరనగర్‌లలో నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకు పరిహారం చెల్లించడం లేదని ఎంపీటీసీ చెన్నమనేని వెంకటరావు సెస్ అధికారులను ప్రశ్నించారు. ఆర్టీసీ బస్సు రావడం లేదేని చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మానస మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎంపీడీవో జోగం రాజు, సిరిసిల్ల, నేరెళ్ల ప్యాక్స్ చైర్మన్లు బండి దేవదాస్, కొడూరి భాస్కర్‌గౌడ్, వైస్ ఎంపీపీ జంగిటి అంజయ్య, ఎంపీటీసీలు కోడి అంతయ్య, సిలివేరి ప్రసూన నర్సయ్య, ములిగే దుర్గప్రసాద్, మీసాల కళ కృష్ణ, గుగ్గిళ్ల లావణ్య ఆంజనేయులు, బుస్స స్వప్న లింగం, నలువాల రేణుక జలేందర్‌రెడ్డి, కనకలక్ష్మిలచ్చిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ పడిగెల మానస